


"నా యెద చేరువలో..."

కల్యాణీరాగం. సరికొత్తబాణీ. పంతులుగారు మధురంగా పాడుతున్నారు. ఆయున పాడిందానికి ఆయునే ఆశ్చర్యపడుతూ, ఆనందిస్తూ పాడుతున్నారు.

"ఎంత బాగుందోయ్ పాట?" అన్నారు కొద్దిసేపటికి.

శకుంతల నవ్వింది. అలా నవ్వటం ఆమెకు అలవాటైపోయింది.

"మరి నేను వెళ్లిరానా?" లేచి నుంచుంటూ అడిగా.

పంతులుగారు తన్మయత్వంలో వుంటూనే తల ఆడించారు. 'బ్రతికానురా' అనుకుంటూ బయులుదేరా. అంతసేపూ బాధను కలిసి భరించాం నేనూ, శకుంతలా. ఇప్పుడు శకుంతల ఒక్కత్తెమీదనే పూర్తిభారం.

శకుంతల తహసీల్దారుగారి కూతురు. వాళ్లింట్లోనే ఒక భాగంలో పంతులుగారూ, మరో భాగంలో నేనూ అద్దెకుంటున్నాం. అద్దె కట్టటానికి బదులు శకుంతలకు సంగీతం నేర్పుతున్నారు పంతులుగారు.

అనుకోకుండా శకుంతల ఒకరోజున నా గది దగ్గరకు వచ్చింది. "ఏవైనా క్రొత్తపాటలు వ్రాశారేమో కనుక్కురమ్మంటున్నారు" అంది.

"ఏమీ వ్రాయలేదే!" అన్నా.

ఇంతలో పంతులుగారే వేంచేశారు-"అదేంటి? వ్రాయుమని చెప్పానే నిన్న?" అంటూ

"ఇవాళ వ్రాస్తాను... అసలేదీ టైం లేందే!"

"వ్రాసింతరువాత తప్పించుకోనేవు! నా ప్రక్కనే ఒక గంటసేపు కూర్చున్నావంటే అద్భుతమైన రాగం అతికిస్తాను."

శకుంతల నవ్వింది. ఆమెకు తెలుసు నా బాధ పంతులుగారి ప్రక్కన ఒకగంట కూర్చుంటే ఎలావుంటుందో.

"అలాగేనండి."

"ఒక్క గంటే-పద శకుంతలా!" పంతులుగారు వెళ్లిపోతుంటే ప్రాణం తేలికైంది.

ఆయనగారక్కడ రెండేళ్ల నుంచీ వుంటున్నారు. ఎవరూ లేరు ఆయునకు, ఒక్క కూతురుతప్ప. ఆమె ఎక్కడో గుంటూరులో వుంది. అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాసేది. వాటన్నిటికీ జవాబులు నాచేతే వ్రాయిస్తుండేవారు పంతులుగారు. బిడ్డంటే ఎనలేని ప్రేమవున్నా ఒక్కసారైనా అటు పోలేదు, ఆమె తండ్రి వద్దకు రానూలేదు. సంగీతపాఠాలు చెప్పుకుంటూ గడుపుతున్నారు పంతులుగారు ఈ వృద్ధాప్యంలో.

మరుసటిరోజు నేను వ్రాసిన మరొక క్రొత్తపాటకు

బాణీలు కట్టి, వన్ను చిత్రహింస చేసి చివరికి జయప్రదంగా వినిపించారు.

"నా కన్నులలో దాగియుంటివి ప్రియతమా
నేనెరుగ నీ మోము అదెట్లో హృదయమా-"

"రేపటిలోగా ఇంకా రెండుమూడు పాటలు వ్రాయవోయి!" పంతులుగారు నా భుజంమీద చేయివేసి అన్నారు.

"ప్రయత్నిస్తాను" అన్నాను.

ఇంతలో పోస్టుజవాన్ పంతులుగారికో కవర్ ఇచ్చిపోయాడు. కూతురు వ్రాసివుంటుంది. పంతులుగారు కవర్ చింపి చదువుతుంటే మెల్లగా బయటపడ్డాను.

ఆ ఉత్తరానికి ప్రత్యుత్తరం రాయటానికి ముప్పతిప్పలు పెడతారాయన. ఒకసారి వ్రాయించి, చదవమని చెప్పి-బాగాలేదనుకొని ఇంకోరకంగా వ్రాయిస్తారు. ఈ విధంగా ఒక్క ఉత్తరం కనీసం గంటా-గంటన్నరదాకానైనా వ్రాయవలసివస్తుంది.

ఆ రోజు రాత్రి భోంచేసి పడుకున్నాను. మరుసటిరోజు ఆఫీసులో ఏం చెయ్యాలో ఆలోచిస్తున్నాను.

"శేషూ!" పంతులుగారి గొంతు దగ్గర్లో వినిపించింది.

"ఆఁ!" వెనక్కి తిరిగిచూస్తే పంతులుగారు గుమ్మంలో నిల్చున్నారు. చేతిలో ఒక కవర్, ధోవతి, బనీను, కండ్లజోడుతో.

"రండి పంతులుగారూ!" లేచి కూర్చున్నా మంచంమీద.

పంతులుగారు వచ్చి ప్రక్కనే వున్న కుర్చీ దగ్గరికి లాక్కున్నారు.

దీపం పెద్దది చేశాను.

పంతులుగారి కండ్లు ఎర్రగా వున్నాయి. తీవ్రంగా ఏదో విషయం ఆలోచిస్తున్నారు. రెండు నిమిషాలలాగే కూర్చున్నారు.

"ఉత్తరం వ్రాయవోయ్!" అన్నారు.

ఎక్కడికో, ఎందుకో చెప్పే అలవాటు లేదాయనకు. అసలా సమయంలో వ్రాసేస్థితిలో లేను నేను. "ఇప్పుడా?"

తల ఊపారు-

"సరే!"

రైటింగ్ ప్యాడ్ తీసుకుని కూర్చున్నా. "చెప్పండి!"

పంతులుగారు చెప్పటం ప్రారంభించారు.

"చిరంజీవి రాజకుమారిని మీ నాన్న దీవించి వ్రాయునది-"

పంతులుగారు ఒక్క నిముషం మౌనం వహించారు.

ఎర్రబడ్డ కండ్లలోంచి కన్నీళ్లు వెలుగులో తళుక్కుమన్నాయి.

అదిరిపడ్డాను. "పంతులుగారూ!"

"వ్రాయి-చిరంజీవి రాజకుమారిని మీ నాన్న దీవించి వ్రాయునది ఏమనగా-"

"రాశానండి."

"రాశావా? అయితే మళ్లీ వ్రాయి."

పంతులుగారు ఈసారి ఆగకుండా చెప్పారు. వ్రాస్తూ కూర్చున్నాను.

"అమ్మా! రాజూ!

"నీ ఉత్తరం ఇవాళే ముట్టింది. నిన్న వ్రాసిన ఉత్తరం చూసి మురిసిపోయాను. ఇవ్వాళ అందిన ఉత్తరం చూసి కంటతడి పెడ్తున్నాను. పద్దెనిమిది సంవత్సరాల తరువాత మళ్లీ ఈ రోజున మీ అమ్మని జ్ఞాపకం చేసుకున్నాను. ఆ నాడు ఆ మహాసాధ్వికి ఇచ్చినమాట ఈనాడు పూర్తి చేయలేకపోయాను. సంపాదిస్తుంది ఎక్కువ

**15.11.1963 ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికలో ప్రచురితమైన ఈ కథ ఆ ఏడాది దీపావళి కథలపోటీలో మూడవబహుమతి పొందింది**

కాకపోయినా పరువుగా బ్రతుకుతూ ఒకరిచేత వేలెత్తి చూపించుకోవటం మన వంశానే లేకుండా పోయింది.

"పండగలకూ, పబ్బాలకూ వస్తానన్నా వద్దని వ్రాశాడు ఈ నాన్న. మొండి ఇంట్లోకి, గాజుల్లేని ఈ సంసారంలోకి, దారిద్ర్యంలోకి నిన్ను తీసుకురావటం ఇష్టంవుండక అలా వ్రాశాను. ఇవాళ నీవు వస్తానంటే నే వద్దంటానా తల్లీ? కానీ అలా కాదమ్మా! పసుపుకుంకుమ చెదరగొట్టుకొని కాదు... వెయ్యేండ్ల భవిష్యత్తుతో... సకలసంపదలతో... మునిమనవలతో... మునిమనవరాళ్లతో రావాలమ్మా!

"ఇది చూడటానికే నే బ్రతికివున్నావా? బిడ్డ నొసట చెరిగిన బొట్టు చూడటంకోసం కాదు. నిర్దాక్షిణ్యంగా, హృదయం లేనివాడిలా వ్రాస్తున్నానని అనుకోకు. ఒక తండ్రిగా, తండ్రికి వుండే ఆశయాలతో వ్రాస్తున్నాను.

"మనసు మార్చుకో రాజూ! ఈ విపత్కరసమయంలో మీ అమ్మను తలుచుకో. నీకు ఏం చేయాల్నో తోస్తుంది. నీ మాంగల్యాన్ని రక్షిస్తుంది. ఆ తల్లి దీవెనలు పొందటానికి ప్రయత్నం చేయి.

"మీ అమ్మ కూడా వద్దంటే వచ్చేసెయ్!

"మీ నాన్న

"కొండల్రావు."

కండ్లు తుడుచుకున్నారు పంతులుగారు.

వ్రాయటం పూర్తయింది. "చదవనా?"అన్నాను.

"వద్దు శేషూ!" ఆయన తల వంచుకున్నారు.

పంతులుగారి పరిస్థితిమీద నాకెంతో జాలి కలిగింది. "పంతులుగారూ! అసలేం జరిగింది?"

"ఏమీ జరగలేదు. జరగబోతుంది!"

"ఏమిటది?"

పంతులుగారు సమాధానమివ్వలేదు. మౌనంగా ఊరుకున్నారు.

ఆ సమయంలో ఆయన్ను బలవంతం చేసి అడగడం భావ్యంగా వుండదనుకున్నాను.

"వెళ్లి పడుకోండి. రేపుదయమే పోస్ట్ చేస్తాను."

ఆయన వెళ్లిపోయారు.

మరుసటిరోజు ఉదయం ఆఫీసుకెళ్తూ -పంతులుగారి వాటావైపు వెళ్లాను. తలుపుకెదురుగా కుర్చీలో కూర్చునివున్నారు పంతులుగారు. ఒక్కరాత్రిలోనే ఆయనెంతో క్షీణించిపోయారు. ఎంతో వృద్ధులుగా కనిపించారు.

ఎందుకైనా మంచిదని అడిగాను-"ఉత్తరం పోస్ట్ చెయ్యమంటారా?" అని.

ఆయన నా కోసరమే ఎదురుచూస్తున్నట్లున్నారు.


"లోపలికి రా!" అన్నారు.

వెళ్లి కూర్చున్నా.

"అసలేం జరిగిందో నీకు తెలియదు కదూ?" అన్నారు.

"ఊహూఁ!"

"నే చెప్పందే నీకెలా తెలుస్తుందీ?" అంత బాధపడ్తూ కూడా పంతులుగారు నవ్వగలిగారు. "రాజకుమారికి విడాకులిస్తానంటున్నాడట అల్లుడు!" అని ఆగి నా వైపు చూశారు.



## ఇమేజ్ పాడుచేసుకుంటున్నారా?

అనుకుంటున్నారు కొందరు అభిమానులు సూపర్‌స్టార్ కృష్ణను గురించి. ఎందుకంటే ఆయన ఇటీవల తనకు వచ్చిన ప్రతి అవకాశాన్నీ వదులుకోకుండా ఒప్పుకుంటున్నారు. అదే శోభన్‌బాబు విషయం తీసుకుంటే, ఆయన తను చేస్తే బావుంటుందని దర్శకనిర్మాతలు అనుకుని వచ్చి అడిగితే, తనక్కూడా నచ్చితేనే చేస్తున్నారు. పైగా తన షరతులకు వారు అంగీకరిస్తేనే. కానీ కృష్ణ 300 చిత్రాలకు పైగా చేసి, దాదాపు మూడునాళ్లు కెరీర్‌కు ఏమవుతుందోనసే పరిస్థితుల్లో మళ్లీ తానేమిటో నిరూపించుకుని నిలదొక్కుకున్నారు. వచ్చిన ప్రతి చిత్రమూ పరిశీలించి తన ఇమేజీకు ఎక్కడా భంగం రాదనుకుంటేనే అంగీకరించాలని అభిమానులు కోరుతున్నారు. కనుక తమ చిత్రాలు ఎప్పుడెప్పుడు చూడాలా అనిపించవలసిన బాధ్యత హీరోలమీద వుంటుందనే సంగతి మరవవద్దని ఆయనకు వారు విన్నవించుకుంటున్నారు. వారి కోరిక నెరవేరుతుందని ఆశిద్దాం.

ఎస్.



"ఎందుకు?"

"చెప్పింది విను-విడాకులెందుకని అడగలేదు. రాజకుమారి ఒప్పుకుంది. నా దగ్గరికి వచ్చేస్తాననంటుంది. ఇక్కడ నా సలహా అడిగితే ఏం చెప్పాలి? వద్దంటే ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటుంది. రమ్మంటే దాని జీవితం? నేనున్నన్నాళ్లూ బాగానేవుంటుందనుకో. తరువాత ఏమవుతుంది? అరిటాకు, ముల్లు సామెతలా ఎటొచ్చీ కష్టాలపాలయ్యేది రాజకుమారి. సంగతిసందర్భాలు కనుక్కోవాలి."

పంతులుగారిలో వైరాగ్యం కనిపిస్తూంది. "చీకూ, చింతా లేకుండా కాలం గడుస్తుందనుకున్నాను. బ్రతికివున్నన్నాళ్లూ ఈ జంజాటం తప్పదేమో!"

"మరి నన్నేం చెయ్యమంటారు?" నేనడిగాను.

"అదే నేనడిగేదీ-నన్నేం చేయమంటావు?"

"మీరొకసారి వెళ్లిరండి-అక్కడికి. పరిస్థితులు చక్కబడ్తాయేమో!"

పంతులుగారు ఆలోచిస్తూ కూర్చున్నారు. "నీవు వెళ్లకూడదూ?"

"నేనా? వెళ్లి ఏం చేయగలుగుతాను?"

"అక్కడికి నే వెళ్లలేను శేషూ-ఈ సహాయం చేయి!" పంతులుగారు గభాల్న నా చేతులు రెండూ పట్టుకున్నారు. ఆయన గొంతు వణికింది. "నే చేయలేంది నీవు చేస్తావు."

"పంతులుగారూ!"

ఆయన కుర్చీలో వెనక్కు వాలిపోయారు -చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడ్చారు.

పంతులుగారు ఒక్కసారే ఇంతగా దిగజారిపోయేసరికి నాకెలాగో అనిపించింది. పంతులుగారి కోసం ఏమైనా చేయాలనిపించింది. కానీ నిస్సహాయుణ్ని-నేనేం చేయగలుగుతాను? కూతురు ఇంటికి తిరిగిరావడం సహించలేరు. కూతురింటికి పోయి అక్కడి అవజయాన్నీ భరించలేరు. అందుకనే కుమిలిపోతున్నారు.

"పంతులుగారూ, చూడండి. నేనక్కడికి వెళ్లడంలో అభ్యంతరం ఏమీ లేదు. కానీ, నేను వెళ్లి ఏం చేయగలను? అసలిలాంటి పరిస్థితిలో నేనెలా ప్రవర్తించాల్నో కూడా తెలీదు. పెద్దలు మీరు. మీకు తోడుగా రమ్మంటే వస్తాను."

అనవసరభారాన్ని నెత్తిమీద వేసుకోవటానికి భయపడి అలా అనలేదు. అదొక జీవితసమస్య-నేను కలుగజేసుకున్నప్పుడు, జరిగే ప్రతి మంచికీ, చెడుకూ కొంతవరకు బాధ్యుణ్నవుతాను. 'మంచి' జరిగితే ఏ తంటా వుండదు. జరిగేదేదో ఊహించనిదే అయి, కీడు సంభవిస్తే? అందులోనూ పంతులుగారి విషయంలో?

"శేషూ!" అన్నారాయన గంభీరంగా.

"ఏమండీ?" అన్నాను.

"నేనక్కడికి వెళ్లటం ఇష్టంగా లేదు. నీవక్కడ చేయవలసిందేమీ వుండదనుకుంటా. వెళ్లిరావెళ్లు."

ఆఫీసుకు సెలవుచీటీ పంపించి రెండు జతల బట్టలు బ్యాగ్‌లో పెట్టుకుని మళ్లీ వచ్చాను.

పంతులుగారు ఒక కవరు నా చేతికిచ్చారు. "నీ చెల్లెలి కాపురం చూడటానికి వెళ్తున్నావు..."

పంతులుగారు మాట్లాడలేకపోయారు. "అమ్మాయి ఎలావుందో చూసిరా!" అన్నారు చివరికి.

"రేపు తిరిగి వచ్చేయనా?"

"రావాలనిపిస్తే వచ్చేయి."

000

గుంటూరులో ఆ యింటిని గుర్తుపట్టడం నాకంత కష్టం కాలేదు.

ఇల్లు చిన్నదే-అయినా ఎంతో బాగుంది.

తలుపు తట్టాను-

"ఎవరు కావాలి?"

"నేను రాజమండ్రి నుంచి వస్తున్నాను. కొండ్రావుగారు పంపించారు."

వెంటనే తలుపు తెరుచుకుంది. సన్నగా, పొడుగ్గా వుందామె. కండ్లు, ముక్కు పంతులుగారివే. -రాజకుమారేనని అనుకున్నాను.

"నమస్తే" అందామె. "లోపలకు రండి!"

చిన్నగది-రెండు కుర్చీలు, ఒక టేబుల్ వున్నాయి. కూర్చుని పంతులుగారిచ్చిన ఉత్తరం ఇచ్చాను.

చదువుకుంది.

ఆమె చదువుతున్నంతసేపూ తరువాత ఏం మాట్లాడాల్నో ఆలోచిస్తూ కూర్చున్నా.

"అయితే అన్నయ్యగారన్నమాట!" అంది నవ్వుతూ.

పంతులుగారి ఉత్తరం ఇంత మంచి వాతావరణం ఏర్పరుస్తుందనుకోలేదు. ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. నిజంగానే నా చెల్లెలి ఇంటికొచ్చినంతగా ఆనందించాను.

"మరి ఇన్నాళ్లెక్కడున్నారు?"

"నాకిక్కడ ఒక చెల్లాయి వుందని తెలిస్తే వెంటనే వచ్చేవాణ్ని."

నవ్వింది. "ఉండండి. ఇప్పుడే వస్తాను. అందాకా ఆ పేపరు చూస్తూండండి" అంటూ రాజకుమారి పేపర్ నా చేతికిచ్చి మరో గదిలోకి పరుగెత్తింది.

మరొక ఐదునిముషాలకే తిరిగొచ్చింది-"నేన్నీళ్లు తోడాను. స్నానం చేయండి" అంటూ. ఆమె కండ్లలో ఎంతో ఉత్సాహం కనబడింది.

ఐదు నిముషాల్లో స్నానం ముగించి వచ్చాను. టిఫిన్, కాఫీ రెడీగా వుంచింది రాజకుమారి.

"మీ వారు లేరా?" అడిగాను.

"వారు వస్తారు. మీరు తీసుకోండి" ప్రక్కనే ఒక కుర్చీలో కూర్చుంది.

రాజకుమారిని చూస్తే ఒక దీర్ఘరోగిలా కనిపిస్తుంది. ఆమె కండ్లలో అవ్యక్తంగా కదిలే బాధను చూడటం సహించలేకే రావడానికి సాహసించలేదు పంతులుగారు.

నేనే అన్నాను-"ఇక్కడికొచ్చేటప్పుడు పంతులుగారేమన్నారో తెలుసా?"

"ఏమన్నారు?" అంది.

"చెల్లెలి కాపురం చూడటానికి వెళ్తున్నావోయ్- అనా

మారి సంతోషించలేదు. తల

"నాన్నగారి కెలా వుంటూందిప్పుడు?"

"ఆరోగ్యమా? బాగానే వుంటున్నారు. కాని అప్పుడప్పుడు చాలా తీవ్రంగా ఆలోచిస్తుంటారు. నేను సరిగ్గా గమనించలేదుగాని, అన్నం, నీళ్లు కూడా మానేసేవారట. ఎందుకనో అర్థం చేసుకోలేకపోయాను. తరువాత తెలిసింది కొంతవరకు."

"ఏం తెలిసింది?"

రాని చిరునవ్వు బలవంతపెట్టినా రాలేదు. ఆ ప్రయత్నం లీలామాత్రంగా మెరిసింది చిన్నబోతూ పెదాలమీద-

"నిజమేనేమోనని భ్రమపడిన అబద్ధం!"

"అంటే?"

"నేనిక్కడ ఏం చూస్తానో అని భయపడుతూ వచ్చాను. కాని ఇక్కడ చూడవలసిందేమీ లేదనుకుంటాను."

"మీరసలేమీ చూడలేరు!"

"అంటే?"

రాజకుమారి పత్రికను చేతిలో పట్టుకుని విసురుకుంటూంది. "మీరు చూడాల్సింది ఇంకా ముందుంది." ఆ విషయానికి నవ్వే అవసరం లేకపోయినా నవ్వింది రాజకుమారి.

"నేను పొరపాటు పడ్డాను-"

"సరే-నాన్నగారు రోజూ ఏం చేస్తుంటారు?"

"ఉదయమే లేచి స్నానపానాదులు ముగించి అరగంటదాకా ఇంటికొచ్చిన పిల్లలకు సంగీతపాఠాలు చెప్తారు. తరువాత తమకు తామే చెప్పుకుంటూ కూర్చుంటారు. విశేషించి ఇంకేమీ లేదు."

"మీరేం చేస్తున్నారు?"

"నాన్నగారు ఉత్తరంలో వ్రాయలేదా?"

"వ్రాస్తే ఎందుకడుగుతాను? మీ పేరుకూడా వ్రాయలేదు."

"మరేం వ్రాశారు?"

"మీ అన్నయ్యను పంపుతున్నాను-అని వ్రాశారు" అంది రాజకుమారి ఎంతో గర్వంతో.

ఎంతో ఆశ్చర్యపోయాను. నేనిన్నాళ్లూ పంతులుగారిని ఏ మాత్రం అర్థం చేసుకోలేదు. పంతులుగారి ప్రతిమాటలోనూ, ధీమా, అధికారం, కనిపించేయి. కారణం ఇదే కావచ్చు. పంతులుగారు ఆ క్షణం నుంచి నాకు ఎంతో పూజ్యులైపోయారు.

"నా పేరు కాశీనాథ్. పంతులుగారు 'శేమా' అని పిలుస్తుంటారు. బి.ఏ. ప్యాసయ్యాను. ఉద్యోగం..."

"అన్నయ్యగారు వకీలనుకున్నాను."

నవ్వి ఊరుకున్నాను.

"కాఫీ చల్లారుతోంది" అంది.

కాఫీ త్రాగాను.

"మీ వారిని గురించి పరిచయమివ్వటం మీకేమైనా అభ్యంతరమా?"

"వారు మీకు స్వయంగానే పరిచయమవుతారు" అంటూ నవ్వింది.

నేను బదులు పలుకలేదు.

"రాజమండ్రి విశేషాలింకేమున్నాయి?"

"ఏముంటాయి? అంతా క్షేమం. మేమంతా వేర్వేరు వాటాల్లో వుంటున్నా ఏకోదరులంగానే ప్రవర్తిస్తాం. అయినా ఇంకేం చెప్పమంటారు?"

గాజులు లెక్కపెడ్తూ కూర్చుంది రాజకుమారి.

"పదినెగారి పేరు?"

"ఏ పదినెగారు? ఓహో! ఆ ప్రాప్తం ఇంకా కలగలేదు. నేనింకా బ్రహ్మచారినే!"

రాజకుమారి వాళ్ల పూర్వగాథ అంతా చెప్పుకుంటూ వచ్చింది. రాజకుమారి పుట్టిన రెండుమూడు నెలలకే తల్లిపోయింది. తండ్రే తల్లిఅయి పెంచాడు. సంపాదించుకున్నదంతా ధారపోసి పెండ్లి చేశాడు. కాని చివరికి ఎన్నో ఆశలువడ్డ పంతులుగారి ఆశలు అడియాసలవుతున్నాయని దుఃఖించింది.

"మీరు నాన్నగారికేమని వ్రాశారు ఉత్తరంలో?"

"ఎప్పుడు?"

"క్రితంసారి."

కండ్లలో నీళ్లు తిరిగాయి రాజకుమారికి.

"సరే, బయటికి వెళ్లివస్తాను" అన్నా, బలవంతం చేయడం ఇష్టంలేక.

"చీకటి పడకముందే వచ్చేయండి, కుక్కలున్నాయి ఈ వీధిలో" కన్నీళ్లు తుడుచుకుంటూ, కొంచెం నవ్వుతూ అంది.

"అలాగే" అంటూ బయలుదేరాను.

000

మళ్లీ ఇంటికొచ్చేసరికి ఎనిమిదైంది.

హాల్లో దీపం వెలుగుతూంది. మెట్ల దగ్గర నిల్చొని చూస్తూంది రాజకుమారి.

నేను వెళ్లింతరువాత స్నానం చేసివుంటుంది -తెల్లని వాయిల్‌చీర కట్టుకుంది-కుంకుమబొట్టు పెట్టుకుంది.

"నా కోసమే చూస్తున్నారా?"

అవునన్నట్లు నవ్వింది.

## రెండు రకాల పాఠాలు నేర్చుకున్నా!

సినీనటుడు కావాలనుకుని 'కిరాతకుడు' చిత్రంలో కోయదొర వేషంతో రంగప్రవేశం చేసిన ఎస్.వి.కృష్ణారెడ్డి, చివరికి దర్శకుడుగా మారి పాతికచిత్రాలకు దర్శకత్వం వహించారు. 'బడ్జెట్ పద్మనాభం, సకుటుంబసపరివారసమేతం' చిత్రాలకు ఇప్పుడు దర్శకత్వం వహిస్తున్నారు. జనరల్‌గా చిత్రాల గురించి చెబుతూ కృష్ణారెడ్డి, "కుటుంబకథాచిత్రాలన్నీ కూడా అప్పటి నుంచి ఇప్పటివరకూ ఒకే రకంగా తయారవుతున్నాయి. దర్శకుడు చెప్పే విధానంలో కాస్త తేడా వుండొచ్చంతే. పెద్దహీరోలతో కూడా త్వరలోనే చిత్రాలు తీస్తానన్న నమ్మకం వుంది నాకు. దర్శకుడుగా ఆ స్థాయిని అందుకుని తీరుతాను. అసభ్యత లేకుండా చిత్రాలు నిర్మిస్తానన్న మంచిపేరు సంపాదించుకున్నాను. ఈ పదేళ్ల అనుభవాలతో గుణపాఠాలూ, ఘనపాఠాలూ-రెండూ నేర్చుకున్నాను. మంచిచెడులను బేరీజు వేయడానికి అవి నాకు తోడ్పడతాయి" అంటున్నారు. అన్నీ బానేవున్నాయి కానీ, మళ్లీ హీరోవేషం మాత్రం వేయకుండా వుంటే జనం బ్రతికిపోతారు!

ఎస్.



లోపలికెళ్తూ అడిగాను-"మీ వారు వచ్చారా?"

"రాలేదు-ఇప్పుడే రారు!"

ప్రక్కగదిలోకెళ్లి బట్టలు మార్చుకునివచ్చాను.

"అన్నం వడ్డిస్తాను-కాళ్లూ, చేతులూ కడుక్కోండి"-వంటింటి తలుపునానుకుని నిలబడివుంది రాజకుమారి.

"వారిని రానియ్యండి-అతిథిమర్యాద కాదు!" నవ్వుతూ అన్నాను.

"వారిప్పుడే రారని చెప్పా, రాత్రెప్పుడో

వస్తారు!"

"ఏం?"

"అలవాటు."

"సరే"నన్నాను.

భోజనం చెయ్యటం పూర్తయ్యేసరికి తొమ్మిదైంది.

వసారాలో ఒక మూల చివరన మంచం వేసింది రాజకుమారి.

వెళ్లి పడుకున్నా.

అంతవరకు నేనుగా చూసింది మననం చేసుకుంటున్నా.

రాజకుమారికే లోటూ లేదు. సంసారం సుఖంగానే వున్నట్లుంది. మరి విడాకుల సమస్య ఎందుకు రేకెత్తిందో వీళ్ల మధ్య ఊహించడం సాధ్యం కాకుండా వుంది. ఆయనగారిని చూసింతర్వాతగాని ఒక నిర్ణయానికి రావడం సాధ్యపడేదేమో!

రాజకుమారిని ఈ విషయం అడిగితే సముద్రం పొంగిపొరలుతుంది-పంతులుగారు తన బిడ్డ ఎలా వుందంటే ఏం చెప్పాలి?

ఒక శోకదేవతలా...

కన్నీటి సముద్రంలా... లేక రాజకుమారిలా వుందని చెప్పాలా?

పంతులుగారి ఏకైకసంతానం రాజకుమారి. తను రెండేండ్లనుండి చూస్తున్నాడు-ఒక్కసారైనా ఆవిడ తండ్రి దగ్గరికి రాలేదు. ఉత్తరప్రత్యుత్తరాలు తప్ప వేరేదేమీ లేదు.

పంతులుగారికి ఇంకా ఏమేం చెప్పాల్నో?

తన కూతురి సంసారం గురించి అడుగుతారాయన. ఒక్కరోజులో ఏం అర్థం చేసుకుంటాడు తనుమాత్రం? అయినా సంసారానికేమైంది?!

అద్దం లాంటి ఇల్లు-

అంతకన్న స్వచ్ఛమైన హృదయంగల ఇల్లాలు.

సంసారంలో ముఖ్యంగా వుండాల్సినవి-ఇల్లు, ఇల్లాలు-పోతే ఇక ఆమె భర్త సంగతి? తను ఆయున్ని చూడలేదు. కనీసం అతన్ని గురించి విననైనా వినలేదు. స్వయంగా ఎలా పరిచయమవుతాడు? ఆలోచిస్తూనే నిద్రపోయాను.

ఓ అర్ధరాత్రిన మెలకువ వచ్చింది.

లోపలినుండి మాటలు వినిపిస్తున్నాయి. ఒక కంఠం రాజకుమారిది. మరొకటి మగగొంతు. బహుశా భర్త కావచ్చు. తాగివచ్చిన మనిషిలా మాట్లాడుతున్నాడు.

"ఊరుకోండి. ఆయన బయట పడుకున్నారు. మీ అల్లరి విని నిద్ర లేస్తారు" రాజకుమారి అంటూంది.

"అసలతనెరు నా ఇంటికి రావటానికి? బయటికెళ్లిపొమ్మను! అన్నట, అన్న! రోగిష్టిదానికి రోగిష్టి అన్న!"

"ఛీ!"

కొంతసేపు నిశ్శబ్దం.

మళ్లీ అతని కంఠం వినిపించింది. "వెళ్లమని చెప్తావా? నాల్గు తన్ని నేనే వెళ్లగొట్టాల్నా?" గర్జిస్తున్నాడు.

"ఎందుకెళ్తారు? నా కోసం వచ్చారు వారు!"

"అసలు నువ్వెవరివి మాట్లాడటానికి?"

"మీ భార్యను-కట్టుకున్న భార్యను!"

"షటప్! రేపు వెళ్లిపోయేదానివినీలాంటి మూర్ఖరోగిని పెంచుకోవడమే నాకు నామర్దా! ఇంకా భార్యవనే బిరుదా నీ మొహానికి?"

రాజకుమారి ఏదో అనబోయింది. ఛెళ్లుమని చప్పుడైంది.

కొడ్తున్నాడు వెధవ-రాజకుమారిని-సంగీతం పంతులుగారి కూతుర్ని-నేనేదో నా బాధ్యతను విస్మరిస్తున్నట్లనిపించింది.

"వెధవను బయటికి లాగివడేస్తాను!"

అంటున్నాడతను రొప్పుతూ.

రాజకుమారి తలుపుకడ్డంగా నిల్చొనుండవచ్చు. తలుపు చప్పుడైంది. తరువాత రాజకుమారి మూలిగినట్లు చప్పుడు.

"నీ బొమికలు విరగతంతా! నాకడ్డు రాకు!"

"ఆ కొట్టేదేదో రేపు విరగ్గొట్టండి. రేపాయున వెళ్లిపోతారు. మీ కాళ్లు పట్టుకుంటాను."

"ఛ! వెధవ...!" వీపుమీద 'ధబ్'మని కొట్టినట్లు చప్పుడు.

లేచి కూర్చున్నా

లాభం లేదు. నేను జోక్యం చేసుకోవాలి.

తన్ని చంపేస్తాడా దేవతను? తలుపుదాకా వెళ్లాను. అయినా ఏదో అదృశ్యశక్తి వారించింది నన్ను. పంతులుగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి "నీవక్కడ చేయవలసిందేమీ వుండదు!"

పంతులుగారు నన్ను బంధించివేశారు. ఇటువంటిదేదో జరుగుతుందని వారికి ముందే తెలుసునేమో!

లోపల రాజకుమారి ఏడుస్తోంది. మూలుగు ఇంకా స్పష్టంగా వినబడుతూంది.

'అయ్యో పంతులుగారూ-లోపల రాజకుమారి విలపిస్తూంది. ఇప్పుడైనా నన్ను బంధవిముక్తుణ్ని చేయండి!' లోలోన కేకేశాను.

చేతకాని అన్నను సంపాయించిఇచ్చారు పంతులుగారు తన బిడ్డకు. కన్నీరుమున్నీరయ్యాను రాత్రల్లా.

రాజకుమారి కంటే నేనే ఎక్కువ విలపించానా రాత్రి.

000

తెలతెలవారుతుండగానే అతను బయటికి వెళ్లిపోయాడు. అస్పష్టంగా చూశాను. నడక ఎక్కడో చూసినట్లు గుర్తు.

కాఫీ తెచ్చింది రాజకుమారి.

"నాకలవాటు లేదు. ముఖం కడుక్కున్న తరువాత త్రాగుతాను."

రాజకుమారి తీసుకెళ్లిపోయింది. విచారాన్ని సూచించే ఛాయలు ఏమీ కనిపించలేదామెలో, ఎంతో మామూలుగా వుంది.

ముఖప్రక్షాళనం చేసివచ్చి కాఫీ త్రాగుతూ అడిగాను-"ఆయన వెళ్లిపోయారా?"

"ఆఁ!"


"నాతో మాట్లాడటం యిష్టంగా లేదేమో!"

నవ్వింది రాజకుమారి. "మిమ్మల్ని అడిగినట్లు చెప్పమన్నారు."

ఎంతో తేలిగ్గా చెప్పింది రాజకుమారి ఈ విషయం. రాత్రి ఏమీ జరగనట్లే మాట్లాడింది.

"సంతోషం-నేను వెళ్తున్నాను."

"అప్పుడే?"



"వెళ్లాలి. మళ్లీ ఎప్పుడైనా వస్తాను. అక్కడ పంతులుగారు నాకోసం ఎదురుచూస్తుంటారు."

రాజకుమారి మౌనం వహించింది.

వెళ్లబోతూ అడిగాను-"ఏం చెప్పమంటారు?"

నేలచూపులు చూస్తూ అన్నది-"ఉత్తరంలో వ్రాసిన విధంగా జరగదని చెప్పండి." కన్నీళ్లు నేలమీదికురికాయి.

"వెళ్తున్నాను-సెలవు."

గుమ్మందాకా నడిచాను.

"అన్నయ్యా!"

వెనక్కితిరిగి చూశాను. ఎంత బాగుందా పిలుపు! రాజకుమారి పిలిచింది. తన మనసులోని ప్రేమంతా అమృతంగా మార్చి ఆ పిలుపులో నింపింది.

"అపార్థం చేసుకున్నావా అన్నయ్యా?"

"లేదు... చెల్లాయి... లేదు...!" బయటికి సరిగా రాలేదు నా మాటలు. గబగబా వీధిలోకి నడిచాను.

ఇంకా రాజకుమారి ఏడుపు వినిపిస్తోంది,

000

రైలులోకెక్కి కూర్చున్నా. ఆపుకుందామనుకున్నా దుఃఖం ఆగకుండా వుంది. ఎక్కడికో ఏకాంతంలోకి వెళ్లి తనివితీరా ఏడ్వాలనిపించింది.

వాటంతట అవే కన్నీళ్లు జాలువారుతున్నాయి.

"ఏమండీ!" ఎవరో పిలుస్తున్నారు. ప్లాట్‌ఫారం మీద నిలబడి వున్నాడు.

కిటికీలోంచి తొంగిచూశాను.

అతనేదో చెప్తున్నాడు నన్ను చూస్తూ. ఎక్కడో చూసినట్లుందిచిందరవందర జుట్టు.

"క్షమించాలి... మీరు... నన్ను... మీరు"-అతను స్పష్టంగా చెప్పలేకపోయాడు.

ప్రశ్నార్థకంగా చూశాను.

"నేను లోకేశ్వర్‌రావును. రాజకుమారి భర్తను. రాత్రి జరిగిన గొడవకి ఎంతో విచారిస్తున్నాను."

అతను చెప్పేది వెంటనే గ్రహింపులోకి రాలేదు. ఏం చెప్తున్నాడతను? ఎవరతను? తను అతన్ని క్షమించాల్నా?

అతను చెప్తూనేవున్నాడు. "చాలా విచారిస్తున్నాను. మీరు నన్ను క్షమించాలి."

రైలు కదిలింది. అతనక్కడే నిలబడిపోయాడు.

"మీరు లోకేశ్వర్‌రావుగారా?" పెద్దగా కేకేశాను.

అప్పటికే పది గజాలు దూరమయ్యాడతను. ఆ దూరంలో నిలబడి "అవు"నంటూ తల వూపాడు.

రైలు మరీ దూరమైపోయింది.

ఎంత చిత్రమైన మనిషి? లోకేశ్వర్‌రావా ఇప్పుడు తనతో మాట్లాడింది? చాలాసేపటివరకు కోలుకోలేకపోయాను.

రాజకుమారి భర్త నా దృష్టిలో క్రూరుడు, కఠినాత్ముడుకాని, అదిప్పుడు పూర్తిగా తారుమారై కూర్చుంది.

క్షమాపణల్ని మోసుకొచ్చాడతను.

పంతులుగారు వెంటనే గుర్తుకొచ్చారు. ఆయనతో ఏం చెప్పాలి?

రాజకుమారి హీనస్థితి-ఆయన అల్లుడుగారి మంచితనం-ఒకటే తోచింది-మంచితనపు ముసుగులో లోకేశ్వర్‌రావు వికృతస్వరూపం!

రాజకుమారి గుండెనిండా పగిలిన మంచితనపు అమృతభాండాలు-

గుండె బరువెక్కింది.

"నీ చెల్లెలి కాపురం చూడబోతున్నావు శేషూ!" అన్నారు పంతులుగారు.

అసలు నేను చూసినదేమిటి? నాకేం అర్థం కాలేదని అన్నాను ఆయనతో.

తన బిడ్డ కాపురం ఛిన్నాభిన్నమవుతుందన్న భావాన్నయినా పంతులుగారు భరించలేరు. అదో ఆయన కూతురు వద్దకు రాకుండా ఉండటానికి కారణం-ఆయనేదీ భరించలేదు. కనీసం నేను చెపబోయే మాటలనైనా భరించలేరు.

పంతులుగారు నాకోసం నిరీక్షిస్తూంటారు.

వేయిగుండెల దడదడలతో నా కోసం ఎదురుతెన్నులు చూస్తూంటారు... కావిరి నిండిన కండ్లతో సతమతమవుతూంటారు.

పంతులుగారి స్మృతి నా బాధాశ్రువుల్లో సంతోషాన్ని చిమ్మింది.

000

స్టేషన్ నుంచి ఇంటికి చేరుకునేసరికి చాలా ఆలస్యమైంది. దూరం నుంచే చూశాను...

గేటు దగ్గర చాలామంది నుంచుని ఏదో చూస్తున్నారు.

పరుగెత్తాను.

అక్కడ భీతావహదృశ్యాన్ని చూసి స్తంభీభూతుణ్నయ్యాను.

పంతులుగారిని పీటమీద కూర్చోబెట్టి, చెరొకవైపు మనుషులు పడిపోకుండా పట్టుకుని నీళ్లు పోస్తున్నారు.

పంతులుగారి శవం అది తల ఎటంటే అటే వాలిపోతుంది.

"పంతులుగారూ!" పెద్దగా కేకేశాను.

ముందుకు పరుగెత్తబోతే ఎవరో పట్టుకున్నారు.

మరింకెవరో అంటున్నారు-"ఇంకెక్కడి పంతులుగారు?"

"వారి కష్టాలు ఈనాటికి పూర్తయ్యాయి."

"అయ్యో, పంతులుగారూ! నన్నటు పంపించి మీరిటు వెళ్లిపోయారా? అందుకేనా నన్ను పంపించింది?"

"పంతులుగారెంతపని చేశారు?"

"ఎలా ఇంతమందిని వదిలి వెళ్లిపోగలిగారు?"

పంతులుగారు జీవితంలో తనని నమ్ముకున్న వాళ్లకేనాడూ అన్యాయం చేయలేదు. ఏకైకఆశఆస్తి రాజకుమారి. ఇన్నాళ్లకు రాజకుమారే పంతులుగారి బాధ్యత. అందుకే ఇన్నాళ్లూ జీవించిఉన్నారు. ఆ బాధ్యత నాకిచ్చివేసి పరలోకగతులయ్యారు.

నిశ్చయమరణం వారిది... తృప్తితో చివరి శ్వాస పీల్చిఉంటారు.

పంతులుగారి బాధ్యత నా బాధ్యతైంది.

ఈ పవిత్రమైన బాధ్యతను ప్రసాదంలా నా కోసం మిగిల్చారు పంతులుగారు!

■

## అమల దృష్టి రాజకీయాలవైపు

ఇటీవల అమల తన బ్లూక్రాస్ సంస్థ కార్యక్రమాల్లో ఆక్టివ్‌గా పాల్గొనటమే కాక, భర్త నాగార్జునను కూడా వాటికి రమ్మని పట్టుబట్టటంతో ఆయన తరచూ వాటిలో పాల్గొంటున్నారు. అమల తనకు తీరిక దొరికినప్పుడల్లా నాగ్ షూటింగుల సెట్లకు వెళ్లి అక్కడ రాజకీయాలు జోరుగా చర్చిస్తున్నారట. ఈ మధ్య అధికారులు రోడ్లమీదే పిచ్చికుక్కలను కాల్చేస్తుంటే దాన్ని అడ్డుకుని, అందరి ప్రశంసలూ అందుకున్నారు అమల. కేంద్రమంత్రి మేనకాగాంధీ స్వయంగా తన సంస్థ గురించి కనుక్కునేలా చేశారు. చాలామంది రాజకీయనాయకులూ, వ్యాపారవేత్తలూ అమల-నాగ్‌ల జంటను తమతమ ఇళ్లకు ఆహ్వానిస్తుంటే హాజరవుతున్నారట.

సాయంకాలమయ్యేసరికి అమల ఏదో ఒక సామాజికకార్యక్రమానికో, మీటింగుకో హాజరవుతుండటం చూస్తే, త్వరలోనే ఆమె రాజకీయాల్లో చేరుతారేమో అనుకుంటున్నారు చాలామంది సినీజనం.

ఎస్.

